ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు - గరిష్ఠం : 38.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY 5 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు
గురువారం 20 మార్చి 2025



# ఉపాధి కల్పనే లక్ష్యం

**జిల్లాను పారిశ్రామిక హబ్‌గా మార్చే యత్నం**
- ప్రతి నియోజకవర్గంలో ఓ పారిశ్రామిక పార్కు
- భూసేకరణ, అవసరమైన భూముల గుర్తింపు
- పరిశ్రమల ఏర్పాటుతో తీరనున్న నిరుద్యోగ సమస్య



టేకులోడులో పారిశ్రామిక క్లస్టర్

పుట్టపర్తి, మార్చి19(ఆంధ్రజ్యోతి): జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రతి నియోజక వర్గానికి ఒక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నట్లు గతంలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ నేపథ్యంలోనే జిల్లా అంతటా పారిశ్రామికాభివృద్ధి విస్తరణకు కసరత్తు చేస్తోంది. ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు శరవేగంగా చర్యలు తీసుకుంటోంది. అవసరమైన భూముల సేకరణ, ఇప్పటికే ఉన్న భూముల్లో పరిశ్రమలు ఏర్పాటుకు ఏపీఐఐసీ సమాయత్తం అవుతోంది.

## నియోజకవర్గానికో పారిశ్రామిక పార్కు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి పాలసీ 4.0 తీసుకువచ్చింది. స్పీడ్ ఆఫ్ బిజినెస్ వేగవంతం చేస్తూ జిల్లాల్లో పరిశ్ర మల ఏర్పాటుకు కావాల్సిన అవసరమై భూములను గుర్తిస్తున్నారు. ఇప్పటికే పెనుకొండ, పాలసముంద్రం, కప్పలబండ, హిందూపురం, మడకశిర, రాళ్ల అనంతపురం, గోళ్లాపురం, గుడిపల్లి, దాదులూరు, శెట్టిపల్లి, నడ్లపల్లి, కొటిపి, కేతిగానిచెరువు, కుటాగుళ్ల, టేకులోడు, ముత్యాలచెరువు ప్రాంతాల్లో పారిశ్రామిక, ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసేందుకు ఏపీఐఐసీ భూములు సిద్ధం చేసింది. జిల్లాలో 17 పారిశ్రామిక పార్కులతోపాటు ఎంఎస్ఎంఈలకు 4502.03 ఎకరాలు గుర్తించగా 3208 ఎకరాలు అందుబాటులోకి వచ్చింది. తాజాగా పెనుకొండ, హిందూపురం, పుట్టపర్తి, కదిరి, మడకశిర, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈల పార్కు కోసం 380 ఎకరాలు సిద్ధం చేశారు.

## ఉపాధి కల్పన దిశగా..

జిల్లాలో కియ కార్ల పరిశ్రమ, అనుబంధ సంస్థలు, పాలసముద్రం వద్ద కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన భెల్, నాసిన్ ఏర్పాటు, రక్షణ రంగాల తయారీ పరిశ్రమలు ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెరిగాయి. తాజాగా మడకశిర నియోజకవర్గంలో భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టం లిమిటెడ్ (కేఎస్ఎస్ఎల్) రక్షణ రంగానికి అవసరమైన ఫిరంగులు మందుగుండు సామగ్రి పరిశ్రమ ఏర్పాటు చేస్తోంది. మొదటి దశలో రూ. 1430 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. అదే విధంగా కల్లుమర్రి గ్రామ పరిధిలో 10 వేల ఎకరాల్లో సోలార్ పార్క్ ఏర్పాటుకు సోలార్ పరిశ్రమలు ముందుకువచ్చాయి. హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు, టేకులోడులో 1105 ఎకరాల్లో భారీ ఇండస్ట్రీయల్ క్లస్టర్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టేకులోడు వద్ద ఇప్పటికే 225 ఎకరాల్లో ఏపీఐఐసీ ఎంఎస్ఎంఈ పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసింది. ఇక్కడే మరో 880 ఎకరాల భూములు అవసరమని ఏపీఐఐసీ గుర్తించింది. ఈ నేపథ్యంలోనే మరో 1500 ఎకరాల సేకరణ దిశగా ఏపీఐఐసీ అడుగులు వేస్తోంది. మడకశిరలో ఇప్పటికే సేకరించిన భూములు కాకుండా మరో 1500 ఎకరాలు సేకరించాలని ఏపీఐఐసీ లక్ష్యం పెట్టుకుంది. గత తొమ్మిది నెలల్లో రూ. 1239 కోట్ల పెట్టుబడులతో 4049 మందికి ఉపాధి కల్పన దిశగా 32 పరిశ్రమలకు 1056 ఎకరాల భూములు కేటాయించారు. ఇప్పటికే జిల్లాలో 8678 ఎంఎస్ఎంఈలతో 54847 మందికి, 48 మధ్య తరహా పరిశ్రమలతో 25682 మందికి 18 భారీ పరిశ్రమలతో 25031 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించింది. పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి దొరుకుతోంది.



కియ కార్ల పరిశ్రమ


నాసిన్

## 40 ఏళ్ల కిందటే పారిశ్రామికాభివృద్ధి

జిల్లా పారిశ్రామికాభివృద్ధికి 1985లోనే అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ బీజం వేశారు. ఆక్రమంలో జిల్లాలో 55వేల ఎకరాలను పారిశ్రామిభివృద్ధికి గుర్తించారు. ప్రత్యేక ఆర్థిక మండళ్ల పేరుతో వచ్చిన లేపాక్షి నాలెడ్జ్ హబ్. సైన్స్‌సిటీల వరకు గుర్తించి సేకరించి భూములే 35 వేల ఎకరాలు పోను జిల్లాలో 19253 ఎకరాల్లో 36 పారిశ్రామిక పార్కుల్లో సూక్ష్మ, మధ్యతరహా, భారీ పరిశ్రమలు ఏర్పాటు చేశారు. జిల్లాలోని పెనుకొండ ప్రాంతానికి కియ రాకతో పరిస్థితి మొత్తం మారింది. ఎందరో నిరుద్యోగులకు ఉపాధి దొరికింది. పరిశ్రమల ఏర్పాటుకు జిల్లాలో ఇంకా రెండు వేల ఎకరాలు భూములు సిద్ధంగా ఉన్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో జిల్లా అంతటా పారిశ్రామిక ప్రగతి సాధించే అవకాశాలు ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు.

రారండోయ్.. నేడు ఖాద్రీశుడి బ్రహ్మ రథోత్సవం

# భక్తులారా..!

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- భక్తులకు ఉచిత రవాణా, భోజనం, తాగునీరు
- సేవకు సిద్ధమైన దాతలు
- ఏడు వందల మందితో బందోబస్తు


శ్రీవారి బ్రహ్మరథం (ఫైల్)

కదిరి/అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఖాద్రీశుడి బ్రహ్మ రథోత్సవానికి భక్తులు సిద్ధమయ్యారు. ఫాల్గుణ మాసం, అనూరాధ నక్షత్రం, మేష లగ్న శుభపుష్కరాంశంలో, గురువారం ఉదయం 7.45 గంటల నుంచి 8.20 గంటల మధ్య రథాన్ని కదిలించేలా ఆలయ వేద పండితులు ముహూర్తం ఖరారు చేశారు. లక్ష్మీ నరసింహస్వామి రథాన్ని వేలాది మంది భక్తులు మొకులతో లాగుతారు. రథం సక్రమంగా కదిలేలా కుటాగుళ్ల, గజ్జలరెడ్డిపల్లి, మూర్తిపల్లి, గంగిరెడ్డిపల్లి గ్రామస్థులు మొద్దులు వేస్తారు. రథోత్సవానికి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రథాన్ని లాగడానికి మోకులు, మొద్దులు, తెడ్లను సిద్ధం చేశారు. వేర్వేరు ప్రాంతాల నుంచి కదిరికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. బందోబస్తు కోసం ఏడు వందల మంది పోలీసులను (మిగతా 7లో..)

# బాధ్యతగా పనిచేయండి

**తహసీల్దార్లు, సర్వేయర్లకు కలెక్టర్ ఆదేశం**

పుట్టపర్తి టౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తహసీల్దార్లు, సర్వేయర్లు బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ భవనంలో ఆంధ్రప్రదేశ్ భూ రీసర్వే గురించి జిల్లాలోని తహసీల్దార్లు, సర్వేయర్లు, డిప్యూటీ తహసీల్దార్‌కు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ మండల తహసీల్దార్లు ఇంటి నివేశన, స్థల ధ్రువీకరణ పత్రాలను మ్యానువల్‌గా ఇవ్వకూడదన్నారు. ప్రతి తహసీల్దార్ డిజిటల్ కీని తనవద్దే ఉంచుకోవాలని, కిందిస్థాయి సిబ్బందికి డిజిటల్ కీ ఇచ్చి అనవసర సమస్యలు కొని తెచ్చుకోవద్దని హెచ్చరించారు. ప్రజాసమస్యల పరిష్కారంలో తహసీల్దార్‌కు ఎటువంటి ఇబ్బంది వచ్చినా ఆర్డీవోలకు తెలపాలని, ఆర్డీవోలకు సందేహం వస్తే జేసీ, డీఆర్వోలను సంప్రదించాలని సూచించారు. తహసీల్దార్లందరూ స్థానికం మండల కేంద్రంలోనే నివాసం ఉండాలని ఆదేశించారు. రీసర్వే సక్రమంగా జరిగితేనే భూ సమస్యలు తగ్గుతాయన్నారు. మండల సర్వేయర్లు గ్రామాల హద్దులు, భూ సరిహద్దుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఐవీఆర్ఎస్ సర్వేలో జిల్లాలోని అమరాపురం, అగళి, చిలమత్తూరు, రొద్దం, రొళ్ల, సోమందేపల్లి సర్వేయర్లపై వచ్చిన ఆరోపణలపై ఆర్డీవోలు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలందించాలన్నారు. జేసీ అభిషేక్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 25మండలాల్లో 25 గ్రామాలను భూ రీసర్వేకోసం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేస్తామన్నారు. ఆర్డీవోలు రీసర్వేపై ప్రతి గ్రామంలో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, పెనుకొండ ఆర్డీవోలు సువర్ణ, మహేష్, వీవీఎస్ శర్మ, ఆనంద్, ల్యాండ్ సర్వే అధికారి విజయశాంతి, 32మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌కుమార్, కలెక్టర్ టీఎస్ చేతన్

# జయమ్మ పొలాన్ని పరిశీలించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ధర్మవరంరూరల్, మార్చి19(ఆంధ్రజ్యోతి): మహిళా రైతు జయమ్మ సమస్యపై అధికారులు స్పందించారు. పొలానికి వెళ్లి బోరు, పంటను పరిశీలించారు. మండలంలోని దర్శినమల గ్రామంలో కొడిగ జయమ్మ పొలంలోని బోరుబావిలో నీరు అడుగంటిపోవడంతో సాగుచేసిన కర్బూజా, వరి పంటలు ఎండిపోయి రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. ఆ మహిళారైతు పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం జయమ్మను వీడిన 'గంగమ్మ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ అధికారులు జయమ్మ పంటపొలాలను బుధవారం పరిశీలించారు. పంటకు పెట్టిన పెట్టుబడి వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. మహిళారైతుకు జరిగిన నష్టం, పంటపొలాల పరిస్థితిపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తామని అధికారులు తెలిపారు. పొలాన్ని పరిశీలించిన వారిలో మండల ఉద్యానశాఖ అధికారిణి అమరేశ్వరి, ఏఓ ముస్తఫా, వీఆర్ఓ చంద్రశేఖర్, ఎంపీఈఓ రాజేశ్వరి తదితరులు ఉన్నారు.


పంటను పరిశీలిస్తున్న అధికారులు

**రంజాన్ వేళలు**
ఇఫ్తార్ : 6.35 (గురువారం సాయంత్రం)
సెహరీ : 5.03 (శుక్రవారం ఉదయం)

# క్యారెట్ ఏదీ..?

**కొనేవారులేక పొలాల్లోనే వదిలేసిన రైతులు**

- మండలంలో వెయ్యి ఎకరాలకుపైగా సాగు
- రూ.పది కోట్ల పెట్టుబడి నష్టం


ఉప్పోలపల్లిలో వదిలేసిన క్యారెట్ తోట

తనకల్లు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): క్యారెట్ ధర పతనమవడంతో సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత మూడు నాలుగేళ్లుగా మండలంలో రైతులు క్యారెట్ పంటను సాగు చేస్తున్నారు. గత ఏడాది క్యారెట్ పంటలో మంచి లాభాలు రావడంతో మండలంలో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. వివిధ గ్రామాల్లో వందలాది ఎకరాల్లో పంట సాగు చేశారు. మొత్తంగా వెయ్యి ఎకరాలకు పైబడి సాగు చేసినట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ధరలు పతనమవవడంతో దిగుబడులను అడిగేనాథుడే లేక పంటను పొలాల్లోనే రైతులు వదిలేశారు. మరి కొంతమంది పొలాల్లోనే ఉంటే వర్షం పడితే కుళ్లిపోతుందన్న ఉద్దేశ్యంతో తొలగిస్తున్నారు. ఒకప్పుడు క్యారెట్ పంట పొలాల్లో ఉండగానే కర్ణాటక ప్రాంతానికి చెందిన వ్యాపారులు ఎగబడి అడ్వాన్సులిచ్చి కొనుగో లు చేసేవారు. వ్యాపారులే కూలీలను తీసుకొచ్చి పంటలను తొలగించి తీసుకెళ్లేవారు. ప్రస్తుతం అందుకు భిన్నమైన పరిస్థితి ఏర్పడింది.

## ఎకరా సాగుకు రూ.లక్షకుపైనే..

ఎకరాలో క్యారెట్ పంట సాగు చేయడానికి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, రసాయనిక ఎరువులు, ప్రత్యేకించి, మైక్రో స్ప్రింక్లర్ల కొనుగోలు కోసం రూ.లక్ష నుంచి రూ.1.2 లక్షల దాకా రైతులు ఖర్చు చేస్తున్నారు. ఎకరానికి పది టన్నులు తక్కువ కాకుండా దిగుబడి వస్తోంది. గత ఏడాది ఇదే సమయంలో కిలో రూ.20నుంచి రూ.25లదాకా ధర పలకడంతో ఎకరానికి రూ. రెండు లక్షల నుంచి రెండున్నర లక్షలదాకా ఆదాయం వచ్చింది. దీంతో పెట్టుబడి పోనూ ఎకరాకు రూ.లక్ష నుంచి 1.3 లక్షల దాకా మిగిలింది. దీంతో రైతులు ఈఏడాది విస్తృతంగా క్యారెట్ పంటను సాగు చేశారు. పంట బాగా పెరిగి, మంచి దిగుబడి వచ్చినా ఎంతో కొంతకు కూడా అడిగేవారే లేరని పలువురు రైతులు వాపోతున్నారు. దీంతో మండల రైతులు పెట్టుబడి రూపంలోనే రూ. పది కోట్లకుపైగా నష్టపోయినట్లు లెక్కలేస్తున్నారు.

## పెట్టుబడి నష్టం



మండల వ్యాప్తంగా వెయ్యి ఎకరాలకు పైగా క్యారెట్ పంటను సాగుచేశాం. రైతులందరి పెట్టుబడి రూ.పదికోట్లకు పైగా నష్టం. నేను కూడా రెండు ఎకరాల్లో పంట సాగు చేశా. మార్కెట్ ఉంటే మండలంలోని క్యారెట్ రైతులకు రూ.25 కోట్ల ఆదాయం వచ్చేది. ఈఏడాది బీట్‌రూట్, క్యారెట్, దోస తదితర అన్ని పంటలతోనూ నష్టమే. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

-శంకర్‌రెడ్డి, రైతు, ఉప్పోలపల్లి

## రూ.ఐదు లక్షలు నష్టపోయా



నాలుగున్నర ఎకరాల్లో ఈఏడాది క్యారెట్ పంటను సాగు చేశా. ఇందుకోసం రూ. ఐదులక్షల పెట్టుబడి పెట్టా. గతఏడాది మంచి లాభాలు వచ్చాయని, ఈఏడాది క్యారెట్ సాగుచేస్తే నష్టాలు మిగిల్చింది. అడిగేనాథుడే లేక పొలంలోనే వదిలేశాం. రోజురోజుకు క్యారెట్ గడ్డలు బలంగా తయారయ్యాయి. మార్కెట్ ధరలు లేకపోవడంతో వ్యాపారులు కొనడానికి ముందుకు రాలేదు. మొత్తంగా పెట్టుబడి అంతా నష్టమే.

-అమరనాథ్‌రెడ్డి, రైతు, ఉప్పోలపల్లి

# మా వినతులపై చిన్న చూపు ఎందుకు ?

### అసెంబ్లీలో వైద్య ఆరోగ్యశాఖను నిలదీసిన ప్రభుత్వ విప్ కాలవ



రాయదుర్గం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వెనుకబడ్డ ప్రాంతాల సమస్యలపై ప్రజాప్రతినిధులు ఇచ్చే వినతులపై చిన్నచూపు సరికాదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు హితవు పలికారు. అసెంబ్లీలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాయదుర్గం ప్రభుత్వ వైద్యశాలలో వైద్యసేవలు, మౌలిక వసతుల కల్పనపై సంబంధిత యంత్రాంగానికి ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేదని ఆరోపించారు. పట్టణంలో పెద్ద ఆసుపత్రి ఉన్నా వైద్యసేవల కోసం పొరుగున ఉన్న బళ్లారికి వెళ్లాల్సి రావడం ఎంతో అవమానంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 2018లోనే ఆస్పత్రి స్థాయిని వంద పడకలకు పెంచుతూ ఆదేశాలు జారీ చేశారన్నారు. కొత్త భవనాలు, మౌలిక వసతుల కల్పన జరిగినా వైద్యుల పోస్టుల భర్తీలో నేటికీ జాప్యం కొనసాగుతోందన్నారు. 22 వైద్యుల పోస్టులు మంజూరైనా 14 పోస్టులు నేటికీ భర్తీ చేయలేదన్నారు. 8 మందిలో ఇద్దరు అనధికార సెలవుపై వెళ్లగా ఒకరు సస్పెండ్ అయ్యారని, మరొకరు దీర్ఘకాల సెలవులో ఉన్నారన్నారు. కేవలం నలుగురు మాత్రమే ప్రస్తుతం రాత్రి విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఆసుపత్రి భవనాల నిర్మాణ పనులు 95 శాతం పూర్తి అయ్యాయని పెయింటింగ్, ఫర్నిచర్ ఏర్పాటు చేస్తే త్వరగా ప్రారంభించవచ్చన్నారు. వైద్యపోస్టుల భర్తీ కోరుతూ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, సంబంధిత ప్రిన్సిపాల్ సెక్రటరీకి వినతులు సమర్పించినా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

# లిక్కర్ స్టోర్‌కు దరఖాస్తు చేసుకోండి

### 26వ తేదీ వరకు అవకాశం

### ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి

అనంతపురం అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కేంద్రంలో ప్రీమియం లిక్కర్ స్టోర్ నిర్వహణ కోసం ఎక్సైజ్ యంత్రాంగం మళ్లీ దరఖాస్తులు ఆహ్వానించింది. తొలుత గత ఏడాది డిసెంబరు 17వతేదీ నుంచి ఆ నెలాఖరు దాకా ప్రీమియం లిక్కర్ స్టోర్‌కు దరఖాస్తు కోసం గడువు విధించారు. అప్పట్లో ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడంతో ఈ ఏడాది జనవరి 7 దాకా రెండోసారి గడువు పొడిగించారు. అయినా స్పందన లేకపోవడంతో జనవరి 18దాకా మూడోసారి గడువు పొడిగించినా ఒక్క దరఖాస్తు దాఖలు కాలేదు. ఈ నేపథ్యంలో ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటు కోసం తిరిగి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. బుధవారం నుంచి ఈనెల 26వతేదీ దాకా దరఖాస్తు చేసుకునేందుకు గడువు విధించారు. 5 సంవత్సరాల కాల వ్యవధితో ప్రీమియం లిక్కర్ స్టోర్‌ను మంజూరు చేస్తామని అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. తొలి ఏడాదిలో లైసెన్స్‌దారులు రూ.కోటి వార్షిక పన్ను చెల్లించాలన్నారు. రెండో సంవత్సరం 10 శాతం పెంచుతామని అన్నారు. 4000 చదరపు అడుగులు బిల్డింగ్ ప్లాన్, మూడు సంవత్సరాల ఐటీ రిటర్న్స్, ఆధార్ కార్డు, పాన్ కార్డులను దరఖాస్తుకు జత చేసి సమర్పించాలన్నారు. ప్రీమియం స్టోర్ ఏర్పాటుకు దరఖాస్తును absb-cl.gov.inలో దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు ఫీజు రూ.15లక్షలు నాన్ రిఫండబుల్ డబ్బులు డీడీ ద్వారా చెల్లించాలన్నారు. ఈనెల 26వతేదీ సాయంత్రం 5 గంటల్లోగా అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తులను ఆఫ్‌లైన్ పద్ధతిలో నేరుగా సమర్పించాలని సూచించారు. దాఖలైన దరఖాస్తులను రాష్ట్ర కమిషనర్‌కు పంపుతామని, రాష్ట్ర ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ప్రక్రియ కొనసాగిస్తామని అన్నారు.

# 27న ఎంపీపీ ఖాళీ స్థానాలకు ఎన్నికలు

### ఉమ్మడి జిల్లాలో 5 ఎంపీపీ, 4 వైస్ ఎంపీపీ ఖాళీలు

అనంతపురం విద్య, మార్చి19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న పలు పదవులకు ఈ నెల 27న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని నోటిఫికేషన్ జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో పలు కారణాల వల్ల ఖాళీ పడిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 5 ఎంపీపీ, 4 వైస్ ఎంపీపీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. అనంతపురం జిల్లాలో కణేకల్లు, కంబదూరు ఎంపీపీ, ఉరవకొండ-2, యల్లనూరు, పెద్దపప్పూరు, రాయదుర్గం వైస్ ఎంపీపీ స్థానాలు ఖాళీ పడ్డాయి శ్రీసత్యసాయి జిల్లాలో గాండ్లపెంట, రొద్దం, రామగిరి ఎంపీపీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఒక్క రోజులోనే నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, విత్‌డ్రా, ఫలితాలు, ఎన్నికైన వారి ప్రమాణ స్వీకరణ ఉంటుంది.

### రెండు ఉప సర్పంచ్ స్థానాలకు..

అనంతపురం న్యూటౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న రెండు ఉప సర్పంచ్ స్థానాలకు ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని నోటిఫికేషన్ జారీ చేశారు. పామిడి మండలం రామగిరి, వజ్రకరూరు మండలం కొనకొండ్ల పంచాయతీలకు సంబంధించి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు.

# రైల్వే డివిజన్‌లో జీఎం తనిఖీలు



ఆదోని రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న అరుణ్ కుమార్ జైన్

గుంతకల్లు, మార్చి 19(ఆంధ్ర జ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ గుంతకల్లు రైల్వే డివిజన్‌లో తనిఖీలు నిర్వహించారు. బుధవారం ఉదయం డివిజన్‌లోని నాల్వార్ నుంచి గుంతకల్లు వరకూ రైలు ట్రాక్‌ను జీఎం తన ప్రత్యేక రైలులో రీర్ విండో తనిఖీ నిర్వహించారు. నాల్వార్-గుంతకల్లు సెక్షన్‌లో ఉన్న యాద్గిర్, కృష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు రైల్వే స్టేషన్లలో తనిఖీలను చేపట్టారు. రాయచూరులోని క్రూ కంట్రోల్ లాబీని పరిశీలించారు. ఆదోని స్టేషన్‌లో అమృత్ భారత్ స్టేషన్ కింద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆదోని, మంత్రాలయం రోడ్ స్టేషన్లకు సమీపంలో తుంగభద్ర నదిపై నిర్మించిన వంతెనలను తనిఖీ చేశారు. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు వచ్చారు. గుంతకల్లు స్టేషన్‌లో తనిఖీలు చేయకుండానే జోనల్ హెడ్‌క్వార్టర్స్ సికింద్రాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. జీఎం వెంట గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, ఏడీఆర్ఎం సుధాకర్, వివిధ శాఖల ఇన్‌చార్జిలు, సబార్డినేట్ అధికారులు పాల్గొన్నారు.



# గజవాహనంపై నారసింహుడు



గజవాహనంపై దర్శనమిస్తున్న శ్రీవారు

కదిరి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీ నరసింహుడు బుధవారం గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజ, హోమం అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. సంధ్యాసమయంలో శ్రీవారు గజ వాహనంపై ఊరేగారు. శ్రీమహావిష్ణు దశావతారాల్లో ఒక్కటైన నారసింహుడికి దేవేంద్రుడు తన వాహనమైన ఐరావతాన్ని పంపుతారని భక్తుల నమ్మకం. తెల్లవారితే బ్రహ్మరథోత్సవం ఉండటంతో ఆలయ ప్రాంగణంతో పాటు తిరువీధులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయారు. భక్తుల కోసం ఆలయంతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థలు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. భక్తులకు వినోదం అందించడానికి ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఉత్సవం ముందు భాగంలో జానపద కళాకారులు ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# రారండోయ్.. భక్తులారా..!

## నేడు ఖాద్రీశుడి బ్రహ్మ రథోత్సవం

(5వ పేజీ తరువాయి..)

రప్పించారు. భక్తుల ఆకలి తీర్చేందుకు దాతలు ఏర్పాట్లు చేసుకున్నారు. తాగునీరు, బయో టాయిలెట్లు ఏర్పాటు చేశారు.

### పటిష్ట భద్రత

బ్రహ్మ రథోత్సవానికి ఎస్పీ రత్న పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారని డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు. ఆరుగురు డీఎస్పీలు, 20 మంది సీఐలు, 40మంది ఎస్ఐలు, ఐదు వందల మంది సివిల్ పోలీసులు, వంద మంది స్పెషల్ పార్టీ, ఎఆర్ పోలీసులు, 90 మంది ఏపీఎస్పీ పోలీసులు విధుల్లో పాల్గొంటున్నారు. ఇతర జిల్లాల నుంచి 60 మంది ప్రత్యేక క్రైమ్ పార్టీ పోలీసులను రప్పించారు. నిఘా కోసం పది డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నారు. సిబ్బందిలో వంద మంది మహిళా పోలీసులు ఉన్నారు. వాహనాలు తిరువీధుల్లోకి రాకుండా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.



ఆలయం ఎదుట కిక్కిరిసిన భక్తులు

### ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

బ్రహ్మరథోత్సవం నేపథ్యంలో కదిరికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. కదిరి డిపోలో ఉన్న 150 బస్సులను భక్తుల రాకపోకలకు వినియోగిస్తారు. కదిరి నుంచి గోరంట్ల మీదుగా హిందూపురం, నల్లమాడ, మదనపల్లి, బెంగళూరు, పులివెందల, తలుపుల మీదుగా ప్రత్యేక బస్సులు నడుస్తాయి. పట్టణంలో జీవిమాను సర్కిల్, వేమారెడ్డి సర్కిల్, హిందూపురం రోడ్డులోని వ్యవసాయ పరిశోధన కేంద్రం ఎదురుగా బస్సు షెల్టర్లను ఏర్పాటు చేశారు.

### అన్నదాన కేంద్రాలు

ఆలయంలో ఎనిమిది వేల మందికి నిత్యాన్నదానం చేస్తున్నారు. దీంతోపాటు రథోత్సవానికి వచ్చే భక్తుల కోసం వేమారెడ్డి సర్కిల్, బస్టాండు, పశువైద్య కేంద్రం, టీటీడీ కల్యాణ మండపం, హిందూపురం రోడ్డు, ఎమ్మెల్యే కందికుంట ఇంటి ఎదురుగా దాతలు అన్నదానం చేస్తున్నారు. నీరు, మజ్జిగ అందిస్తారు. బ్రహ్మరథోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశామని, భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని ఎమ్మెల్యే కందికుంట కోరారు.

### తెడ్లకు పూజలు

తేరు గమనాన్ని నియంత్రించడానికి వాడే తెడ్లకు ఆనవాయితీగా కుటాగుళ్ల కరణం వారసులు రాయసం హరిప్రసాద్ ఇంటివద్ద బుధవారం ప్రత్యే పూజలు నిర్వహించారు. అనంతరం తేరువద్దకు తరలించారు. కార్యక్రమంలో కరణం కుటుంబ సభ్యులు, పురోహితులు నాగభూషణ శాస్త్రి, సునిల్ శాస్త్రి, తెడ్లు తయారు చేసినశంకర్, నీరుగుట్టు చెన్నప్ప, నరేష్, రమేష్, పల్లోల గంగన్న, శ్రీరాములు, కుళ్లాయప్ప, ఉత్తప్ప తదితరులు పాల్గొన్నారు.

### ఏర్పాట్లు సిద్ధం..

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చొరవతో భక్తులు తిరువీధుల్లోకి రావడానికి ఉచిత రవాణా ఏర్పాటు చేశాం. వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి కోనేరు వరకు భక్తులు వచ్చేందుకు మినీ బస్సులు, ఆటోలు ఏర్పాటు చేశాం. తిరువీధుల్లో తాగునీటిని అందుబాటులో ఉంచాము. తాత్కాలిక బయో టాయిలెట్లు ఏర్పాటు చేశాము. వీటి ఖర్చును ఎమ్మెల్యే భరిస్తున్నారు.

-శ్రీనివాసరెడ్డి, ఈఓ

## అలరిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు

బ్రహ్మోత్సవాలలో కళాకారుల ప్రదర్శనలు భక్తులను అలరిస్తున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు, మహిళలు కోలాటం, కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు ఇస్తున్నారు. ఆలయ ఆవరణలో గోవింద నామస్మరణ మార్మోగుతోంది. అనంతపురానికి చెందిన ఓం సంగీత, కోలాట శిక్షణ సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ దేవరకొండ కౌసల్య బృందం ప్రదర్శించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది.



కోలాటం వేస్తున్న కళాకారులు

### ఈ తరానికి గుర్తు చేసేందుకే..



ఎన్నో కళలు కనుమరుగవుతున్నాయి. మన సంస్కృతి, సంప్రదాయాలలో కళలు ఒక భాగం. వాటిని ఈ తరానికి పరిచయం చేసేందుకు పదేళ్లగా కోలాటంలో శిక్షణ ఇస్తున్నాను. స్వామి వేడుకలలో మా బృందం ప్రదర్శన ఇస్తోంది.

-డాక్టర్ కౌసల్య, కోలాట శిక్షకురాలు

### ఆధ్యాత్మిక చైతన్యం



మా బృందం కోలాట ప్రదర్శనను ఖాద్రీశుడి భక్తులు తన్మయత్వంతో చూస్తున్నారు. మాలో మరింత ఉత్సాహాన్ని నింపుతున్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం కలిగించేందుకు మా వంతు ప్రయత్నం చేస్తున్నాం. కుటుంబ ఆలనాపాలనలో నిత్యం తలమునకలయ్యే మాకు కోలాటం ద్వారా ఎంతో ఆనందం కలుగుతోంది.

- రమాదేవి

### ఆనందంగా ఉంది..



ఇంటి పనులు ముగించుకుని, సాయంత్రం పూట వెళ్లి కోలాటం నేర్చుకున్నాను. మా కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో స్వామివారి ఉత్సవాలలో ప్రదర్శన ఇస్తున్నాను. చాలా ఆనందంగా ఉంది.

-రాగిణి

### మా అదృష్టం



స్వామి సన్నిధిలో కోలాట ప్రదర్శన అదృష్టంగా భావిస్తున్నాం. కోలాటం వల్ల మానసిక ఉల్లాసం కలుగుతోంది. 60 ఏళ్లు వచ్చినా ఆరోగ్యంగా ఉన్నాం. యువత తమ అభిరుచి మేరకు ఏదో ఒక కళలో రాణించాలి. మన సంప్రదాయాలను కొనసాగించాలి.

-పద్మలత

### కళలు అవసరం..



మన సంస్కృతి సంప్రదాలు ప్రతిబింబించేలా ఏదో ఒక కళ నేర్చుకోవాలి. మహిళలు నిత్యం పనులతో ఒత్తిడికి లోనవుతుంటారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో సాంత్వన కలుగుతుంది. ఇటీవల ప్రజల్లో మార్పు కనిపిస్తోంది. చిన్నతనం నుంచి తమ పిల్లలకు కళలలో శిక్షణ ఇప్పించి ప్రోత్సహిస్తున్నారు. ఇది శుభపరిణామం.

-విజయలక్ష్మి

# అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అనంత..!

### నేడు ఆధ్యాత్మిక మందిరాల రూపకర్త ప్రసాద్ రాక

### కోటి లింగాల భారీ శివలింగం ఏర్పాటుపై చర్చ

అనంతపురం కల్చరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అనంతపురం జిల్లా గుర్తింపు పొందే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగానే ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కోటి లింగాలతో 300 అడుగుల ఎత్తయిన శివలింగాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమంలో స్థల పరిశీలన, ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించేందుకు ప్రఖ్యాత ఆధ్యాత్మిక మందిరాల రూపకర్త డీఎన్‌వీ ప్రసాద్ స్థపతి శుక్రవారం అనంతపురం విచ్చేయనున్నారు. శంషాబాద్‌లో 216 అడుగుల రామానుజాచార్యుల విగ్రహం, ఓంకారేశ్వర్‌లో 108 అడుగుల శంకరాచార్యుల మూర్తి, తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన స్వర్ణగిరి మందిరాలను దేశం గర్వించే స్థాయిలో డీఎన్‌వీ ప్రసాద్ రూపొందించారు. ఆయనతోపాటు మరో మందిర నిర్మాణ రూపకర్త శ్రీనివాస్ అనంతపురం రానున్నారు. కాగా నార్పల క్రాస్ వద్ద స్థలాన్ని దాదాపుగా ఖరారు చేశారు. దీనిపై తుదినిర్ణయాన్ని డీఎన్‌వీ ప్రసాద్ స్థపతి శుక్రవారం వెల్లడించనున్నారు. ఆ స్థలంలో కోటిలింగాలను ఒకే శివలింగంగా తీర్చిదిద్దడం ద్వారా 300 అడుగుల పంచముఖ శివలింగం, 108 అడుగులతో విష్ణుమూర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేసి హరిహర దేవాలయం నిర్మించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఐదేళ్ల కిందటే నార్పల క్రాస్ వద్ద స్థల పరిశీలన చేసిన డీఎన్‌వీ ప్రసాద్ స్థపతి మందిర ప్రాజెక్టును ప్రారంభించేందుకు శుక్రవారం మరోసారి స్థలాన్ని పరిశీలించేందుకు వస్తున్నారు. అదేరోజు ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు జడ్పీ ఎదురుగా ఉన్న గీతా మందిరం వద్ద సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుపై చర్చించనున్నారు.



డీఎన్‌వీ ప్రసాద్ స్థపతి

# అర్ధరాత్రి దారుణ హత్య

### బైక్‌పై తీసుకెళ్లి నరికి చంపిన దుండగులు

### పోలీసుల అదుపులో నిందితులు.. పురంలో కలకలం

హిందూపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సద్దాం బేగ్(28) మంగళవారం రాత్రి హత్యకు గురయ్యాడు. మలుగూరు చెరువుకట్ట వద్ద అతన్ని నరికి చంపారు. అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు తెలిపిన మేరకు, సద్దాం బేగ్‌కి ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు పిల్లలున్నారు. శాంతినగర్‌లోని రేషం ఫ్యాక్టరీలో కూలి పని చేస్తుండేవాడు. ఇదే ఫ్యాక్టరీలో గడ్డమీద ప్రాంతానికి చెందిన మహ్మద్ షఫీ భార్య రేష్మా అలియాస్ ఆయేషా పనిచేస్తోంది. మహ్మద్ షఫీ మూడేళ్ల క్రితం రేష్మాను వదిలి అనంతపురంలో వేరే మహిళతో కలిసి ఉండేవాడు. ఈ నేపథ్యంలో సద్దాంబేగ్, రేష్మా మధ్య పరిచయం ఏర్పడి, చనువుగా ఉండేవారు. మహ్మద్ షఫీ 20 రోజుల క్రితం హిందూపురానికి వచ్చి, ఇక్కడే ఉంటున్నాడు. సద్దాంబేగ్, రేష్మా చనువుగా ఉండడాన్ని గమనించి, జీర్ణించుకోలేకపోయాడు. ఈ నెల 17వ తేదీ రాత్రి శాంతినగర్‌లోని రేషం ఫ్యాక్టరీకి వెళ్లి భార్యతో గొడవ పడ్డాడు. అక్కడే ఉన్న సద్దాంబేగ్ అడ్డుకోబోగా.. దాడికి యత్నించాడు. దీంతో షఫీపై సద్దాంబేగ్ దాడి చేశాడు. ఈ గొడవపై అదేరోజు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో షఫీ ఫిర్యాదు చేశాడు. మంగళవారం రాత్రి సద్దాంబేగ్, రేష్మా ఇంట్లో ఉండగా ఆ గదికి షఫీ, అతడి తమ్ముడు తౌఫిక్, సోదరి, తల్లి తాళం వేసి, టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వారిని పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. సద్దాంబేగ్ తల్లికి ఆరోగ్యం బాగాలేక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండేది. అక్కడే ఉన్న సద్దాంబేగ్‌ను మంగళవారం అర్ధరాత్రి మహ్మద్ షఫీ, అతడి తమ్ముడు తౌఫిక్ కలిశారు. మాట్లాడేందుకని బైక్‌పై తీసుకెళ్లారు. గుడ్డంపల్లి-మలుగూరు దారిలో చెరువుకట్ట కింద కొడవలితో నరికి హత్యచేశారు. రేష్మా రాత్రి 12 గంటల సమయంలో డయల్ 100కి ఫోన్ చేసి సద్దాంబేగ్‌ను తన భర్త, మరిది తీసుకెళ్లినట్లు సమాచారం అందించింది. దీంతో పోలీసులు సాంకేతికత సాయంతో వెతికారు. అప్పటికే సద్దాంబేగ్‌ను చంపేశారు. పోలీసులు మహ్మద్ షఫీ, అతడి సోదరుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. హత్య విషయం తెలుసుకున్న సద్దాంబేగ్ కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని, బోరున విలపించారు. సద్దాంబేగ్ తల్లి షకీరా ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. డీఎస్పీ మహేష్, సీఐలు జనార్దన్, ఆంజనేయులు.. హత్యాస్థలాన్ని పరిశీలించారు. పుట్టపర్తి నుంచి క్లూస్‌టీమ్‌ను రప్పించి, పరిశీలించారు.



సద్దాం బేగ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, ఇన్‌సెట్‌లో సద్దాం బేగ్ (ఫైల్)

## రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ గురువారం సాయంత్రం | సహర్ శుక్రవారం ఉదయం |
|---|---|---|
| కదిరి: | 6.31 | 5.05 |
| ధర్మవరం: | 6.36 | 5.05 |

# సంక్షేమానికి సన్‌స్ట్రోక్

ఆంధ్రజ్యోతి పరిశీలన

- వసతి గృహాల్లో ఉక్కపోత
- ఫ్యాన్లు ఏర్పాటు చేయని అధికారులు
- ఎండల వేడితో అల్లాడుతున్న విద్యార్థులు
- వడదెబ్బకు గురవుతున్న పిల్లలు





మిట్టపల్లిలో పెచ్చులూడిన పై కప్పు ▲ఫ్యాన్లు లేని కొండకమర్ల బీసీ హాస్టల్

ఓబుళదేవరచెరువు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఎండాకాలం మొదలవడంతో.. రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో.. ప్రభుత్వ బాలుర వసతి గృహాల్లోని విద్యార్థులు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. కనీసం ఫ్యాన్లు కూడా లేకపోవడంతో వడదెబ్బకు గురవుతున్నారు. మండలంలోని కొండకమర్ల, మిట్టపల్లి ప్రభుత్వ బాలుర బీసీ వసతి గృహాల్లోని ఈ సమస్య తీవ్రంగా ఉంది. కొండకమర్లలో వసతి గృహాన్ని పాత థియేటర్‌లో కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారు. ఈ వసతి గృహంలో 26 మంది విద్యార్థులుండగా, కేవలం రెండు ఫ్యాన్లు మాత్రమే ఉన్నాయి. అవికూడా సరిగా పని చేయవు. మిట్టపల్లి బాలుర వసతి గృహంలో 82 మంది విద్యార్థులున్నారు. వీరు పడుకునే గదులు ఎత్తు లేకపోవడంతో ఫ్యాన్లు వేయడానికి అవకాశం లేదు. అయితే గోడ ఫ్యాన్లు ఏర్పాటు చేస్తే.. విద్యార్థులు ఉక్కపోత నుంచి ఉపసమనం లభిస్తుంది. విద్యార్థులు ఉక్కపోత నుంచి రక్షణ కల్పించేలా సత్వర చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

● శిథిలావస్థలో భవనాలు : మిట్టపల్లిలో బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరుకుంది. వసతి గృహం లోపల గోడలు నెర్రెలు చీలడంతో పాటు... పెచ్చులు ఊడి పడుతున్నాయి. వీటికి తోడు మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు కూడా సరిగా లేవు. మిట్టపల్లి వసతి గృహం భవనం పెచ్చులు ఊడిపడుతుండటంతో విద్యార్థులు భయం.. భయంగా కాలం వెళ్లదీస్తున్నారు.

### పరిశీలించి పరిష్కరిస్తాం

కొండకమర్ల, మిట్టపల్లి వసతి గృహాల్లో నెలకున్న సమస్యలను పరిశీలించి, పరిష్కారిస్తాం. కొండకమర్లలో భవనం మార్పునకు చర్యలు తీసుకుంటున్నాం. ఏబీసీ డబ్ల్యూ వసతి గృహలకు పంపి పరిశీలించి, సమస్యలను సాధ్యమైనత త్వరగా పరిష్కరిస్తాం.

- నిర్మలాజ్యోతి, బీసీ వెల్ఫేర్ అధికారి

### ఫ్యాన్లు ఏర్పాటు చేయాలి



ఎండ వేడి ఎక్కువగా ఉండడం వలన ఉక్కపోతతో ఇబ్బందిగా ఉంది. గదుల్లో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలి. వసతిగృహంలో చాలా గదుల్లో పెచ్చులూడుతున్నాయి. మరమ్మతులు చేయాలి.

- భానుతేజ, 9వ తరగతి, మిట్టపల్లి

### పెచ్చులు ఊడుతున్నాయ్



పెచ్చులు ఎప్పుడు ఊడిపడతాయో అని భయంగా ఉంది. వర్షాకాలంలో పెచ్చులు ఊడిన చోట వర్షపు నీరు కారుతుంది. ఇబ్బందులు పడ్డాం. పెచ్చులు ఊడిన ప్రాంతంలో కడ్డీలు కనిపిస్తున్నాయి. మరమ్మతులు చేయాలి.

- అబ్దుల్, 9వ తరగతి, మిట్టపల్లి

## న్యూస్ బాక్స్

### నేడు విద్యుత్ సరఫరా బంద్

కదిరిఅర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం సందర్భంగా గురువారం విద్యుత్ సరఫరాను బంద్ చేస్తున్నట్లు డీఈ మోసెస్ బుధవారం తెలిపారు. ఆలయ తిరువీధులు, పూలబజారు, అయ్యప్పస్వామి ఆలయ వీధి, ఎట్టిగడ్డ తండా, వాసవీనగర్, వలీసాబ్‌రోడ్డు, అలాంఖాన్ మసీదు ప్రాంతం, పాత స్టేట్‌బ్యాంక్ వీధి, ఇక్బాల్‌రోడ్డు, జౌకపాళ్యం, నల్లగుట్టవీధి, మారుతీనగర్, సున్నపుగుట్టతండా ప్రాంతల్లో ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

### యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కేశవయ్య

పుట్టపర్తి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యాదవ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పెనుకొండకు చెందిన కేశవయ్యను నియమిస్తూ రాష్ట్రప్రభుత్వ కార్యదర్శి సత్యనారాయణ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. కేశవయ్య ఈ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగుతారు.

### 27న న్యాయవాదుల సంఘం ఎన్నికలు

కదిరిలీగల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కదిరి న్యాయవాదుల సంఘానికి ఈ నెల 27న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు నాగేంద్రరెడ్డి, ఎన్నికల కమిషనర్ డీ షాఅలీమియా బుధవారం తెలిపారు. ఈ సంఘానికి అధ్యక్ష, ఉపాధ్యక్షుడు, జనరల్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, లైబ్రరీ సెక్రటరీ, కోశాధికారుల స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. 21, 22న నామినేషన్ల స్వీకరణ, 24న ఉపసంహరణ, 25న ఓటర్ల జాబితా విడుదల చేస్తామన్నారు. 27న ఎన్నికలను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

### మంత్రి నారా లోకేశ్ ప్రకటనపై హర్షం

కదిరి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. మీసేవల బలోపేతానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించడంపై రాష్ట్ర మీసేవ నిర్వాహకుల సంక్షేమ సంఘం కార్యనిర్వాహకులు భాను, కార్యదర్శి పూలశెట్ట చలపతి, పఫూరి లక్ష్మీనారాయణ, బుధవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నారాలోకేశ్ చేపట్టిన పాదయాత్రలో తాము కలిసినప్పుడు.. మీసేవల బలోపేతాలపై హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ మేరకు లోకేశ్ అసెంబ్లీలో చర్చించడంపై ఆనందం వ్యక్తం చేశారు.

### గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి



క్రిష్టప్ప(ఫైల్)

నల్లమాడ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చారుపల్లి ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు క్రిష్టప్ప (56) గుండెపోటుతో బుధవారం మరణించాడు. మంగళవారం అర్ధరాత్రి గుండె నొప్పి రావడంతో వెంటనే కుటుంబ సభ్యులు నల్లమాడ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే అతను మరణించినట్లు నిర్ధారించారు. పలువురు టీడీపీ నాయకులు క్రిష్టప్ప మృతదేహానికి నివాళులర్పించారు. క్రిష్టప్పకు భార్య మణెమ్మ, కుమార్తె ఉన్నారు.

### రేకుల షెడ్డు తొలగింపు



ముదిగుబ్బ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి చెందిన స్థలాన్ని కొందరు ఆక్రమించి.. శాశ్వతంగా షెడ్ నిర్మించుకున్నారు. దీనిపై ఆ సంఘం సభ్యులు ఉన్నతాధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో ముదిగుబ్బ పీఏసీఎస్ సీఈవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి మంజుల, ముదిగుబ్బ టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్ బుధవారం ఆ స్థలాన్ని పరిశీలించారు. స్థలంలో అక్రమంగా షెడ్ నిర్మించినట్లు గుర్తించారు. ముదిగుబ్బ పీఏసీఎస్ స్పెషల్ ఆఫీసర్ వన్నూరుస్వామి దాన్ని వెంటనే ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు.

### కదిరి సబ్ జైలు తనిఖీ



మాట్లాడుతున్న న్యాయాధికారి

కదిరిలీగల్, మార్చి 19(ఆంధ్ర జ్యోతి): కదిరి సబ్ జైలును జిల్లా న్యాయసేవ అధికారి సంస్థ కార్యదర్శి న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ బుధవారం తనిఖీ చేశారు. మౌలిక సదుపాయాలు, వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు వాసుదేవ రెడ్డి, న్యాయవాది రఘునాథ్ పాల్గొన్నారు.

### భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ బుధవారం ప్రారంభించారు. కందికుంట నివాసం ముందు ప్రతి సంవత్సరం బ్రహోత్సవాల్లో అన్నదానం చేయడం ఆనవాతీగా వస్తోంది. అందులో భాగంగా ఈ సంవత్సరమూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, గాలివేటి క్రిష్ణమోహన్‌నాయుడు పాల్గొన్నారు.

### హిందీ పరీక్షకు 141 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా జరిగిన పదోతరగతి హిందీ పరీక్షలకు 141 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ కిష్టప్ప తెలిపారు. 104 కేంద్రాల్లో 21,271 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 21,130 మంది పరీక్షలు రాశారని డీఈఓ తెలిపారు. దీంతో హాజరు 99.34 శాతంగా నమోదైందన్నారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులు 11 కేంద్రాలలో 547 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 448 మంది హాజరయ్యారని 99 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి ఆటంకాలు లేకుండా పరీక్షలు సజావుగా జరిగాయని ఆయన తెలిపారు.

## అలరించిన పౌరాణిక ప్రదర్శన



నాటక ప్రదర్శనలో కళాకారులు



హరికథ చెబుతున్న సూర్యనారాయణ

కదిరి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం కదిరి పట్టణంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బాలికల కళాశాల ఆవరణలో నిర్వహించిన పౌరాణిక ప్రదర్శనకు వేలాది మంది హాజర య్యారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన చింతా మణి, సత్యహరిశ్చంద్ర, రామాంజినేయుద్ధం నాటకాలు ఆకట్టుకున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన కళాకారులు తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సహకారంతో నిర్వహించిన ఈ పౌరాణిక నాటక ప్రదర్శనలో తమిళనాడు రాష్ట్రం ఐఆర్ఎస్ అధికారి బైరెడ్డి లోకనాథరెడ్డి, బైరెడ్డి కిషోర్‌కుమార్‌రెడ్డి, దామోదర్, కె.మల్లి, పెద్దన్న, గాలివీటి కృష్ణమోహన్ నాయుడు, జయ, సుధాకర్‌రెడ్డి, నిర్వాహకులు బండల నాయుడు, కేబీ నాగప్ప, సంగీత మాస్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే ఆలయ ఆవరణంలో హరిదాసు సూర్యనారాయణ హరికథా కాలక్షేపం ఆకట్టుకుంది.

### ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన



ప్రశంసాపత్రాలు అందుకున్న ధర్మవరం నాట్యకళాకారులు

ధర్మవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కదిరి లక్ష్మీనరసింహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ధర్మవరానికి చెందిన కళాకారుల భరత, కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. లలిత కళానికేతన్ నాట్యగురువులు బాబూ బాలాజీ, రామలలిత్య శిష్యబృందం 20 మంది పాల్గొని నరసింహస్వామి చరితం, ప్రహ్లాద పట్టాభిషేకం తదితర ఘట్టాలను నాట్యరూపంలో ప్రదర్శించారు. ఆలయ ఈఓ శ్రీనివాసులు వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

### తాగునీటి సమస్య పరిష్కరించండి



నిరసన తెలుపుతున్న మహిళలు, నాయకులు

ఓబుళదేవరచెరువు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తమకాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక అశోక్‌నగర్ కాలనీవాసులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో బుధవారం నిరసన చేపట్టారు. కాలనీ వాసులు రేణుకా, జయమ్మ, ఈశ్వరమ్మ, శివమ్మ తదితరులు మాట్లాడుతూ.. కాలనీలో 50 ఇళ్లు ఉన్నాయని, వాటి అన్నింటికి కలిపి ఒక కొళాయి మాత్రమే ఉందని, ఆ కొళాయిలో కూడా నీరు సరిగా రావడంలేదని వాపోయారు. తమ కాలనీలోనే మరిన్ని ప్రాంతాల్లో కొళాయిలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని కోరారు. వీరికి మద్దతుగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యదర్శి చలపతినాయుడు నిరసనలో పాల్గొన్నారు. ఎంపీడీఓ రాబర్టు విల్సన్ స్పందిస్తూ.. అదనంగా కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

### విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న ఉపాధ్యాయుడు నాగరాజు

ఓబుళదేవరచెరువు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని డబురువారిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒంటి పూట బడులు ఉండడంతో 24 మంది విద్యార్థులు అల్పాహారం తినకుండానే పాఠశాలకు వస్తున్నారు. ఈ విషయాన్ని గమనించిన ఆ పాఠశాల ఉపాధ్యాయుడు కె. నాగరాజు సొంత ఖర్చుతో వారికి అల్పాహారం అందించే కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ బడులు ముగిసేంత వరకు వారికి ఇలా అల్పాహారం అందిస్తానని చెప్పారు. ఇందులో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

### తెలుగు భాషను ఐచ్ఛికం చేయకండి

కొత్తచెరువు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియేట్ విద్యలో సంస్కరణల్లో భాగంగా ద్వితీయ భాష తెలుగును ఐచ్ఛిక సబ్జెక్టుగా మార్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని సత్యసాయి జిల్లా తెలుగు అధ్యాపకుల సంఘం నాయకులు డీఐఈఓ రఘునాథరెడ్డికి వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో మూల్యాంకనానికి వచ్చిన తెలుగు అధ్యాపకులు బుధవారం నిరసన చేపట్టారు. తెలుగును ఆప్షనల్ చేయడం వల్ల భాష మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు షేక్‌నూరుల్లా, శంకరప్ప, పెద్దన్న, రాజ్‌కుమార్, బయారెడ్డి, నాగరత్నమ్మ, లలిత పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న అధ్యాపకుల సంఘం నాయకులు

### పరీక్షకు ఒకరి బదులు.. మరొకరు

కదిరి/అర్బన్, మార్చి19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఓపెన్ పది పరీక్షల్లో ఒకరి బదులు మరొకరు పరీక్ష రాసినట్లు గుర్తించినట్లు డీఈఓ కిష్టప్ప చెప్పారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ఓపెన్ పది పరీక్షలు నిర్వహిస్తున్నారు. డీఈఓ తనిఖీ చేయగా.. ఒక విద్యార్థినికి బదులు మరొకరు బుర్ఖా వేసుకుని, పరీక్షలు రాస్తుండగా గుర్తించారు. ఆ విద్యార్థినిని బయటకు పంపారు. పరీక్షాకేంద్రం ఇన్విజిలేటర్ వరలక్ష్మి, చీఫ్ షరీఫ్, డిపార్టుమెంట్ అధికారి మురళిని రిలీవ్ చేస్తున్నట్లు డీఈఓ తెలిపారు.

● పరీక్ష కేంద్రాల తనిఖీ : కదిరిలో పది పరీక్షాకేంద్రాలను బుధవారం ఆర్జేడీ శామ్యూల్, డీఈఓ కిష్టప్ప తనిఖీ చేశారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని ఏ, బీ సెంటర్లలో ఆర్జేడీ, ప్రభుత్వ బాలుర పాఠశాల ఏ, బీ సెంటర్లను డీఈఓ తనిఖీ చేశారు.

### మురుగు కాలువ పనులు ప్రారంభం

కదిరిఅర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరి కుంట్లపల్లి పంచాయతీలోని సోమేష్ నగర్‌లో మురుగునీటి కాలువ నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ పనులను ఎంపీడీఓ పోలప్ప పరిశీలించారు. ఈ ప్రాంతంలో మురుగునీటి సమస్య ఉందని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకొని వెళ్లగా.. పంచాయతీ నిధులు రూ.8 లక్షలు మంజూరు చేశారన్నారు. దీంతో ఈ పనులను ప్రారంభించామన్నారు. ఆయన వెంట పంచాయతీరాజ్ జేఈ గురురాజుగుప్త, కార్యదర్శి రామమోహన్ ఉన్నారు.

### పారిశుధ్య కార్మికులకు సన్మానం

తనకల్లు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక 30 పడకల ఆసుపత్రిలోని మహిళా పారిశుధ్య కార్మికులను బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వంశీకృష్ణ బుధవారం సన్మానించారు. ఆసుపత్రిలో ఉన్న వివిధ సమస్యలను డాక్టర్ విజయబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు సురేష్ గోపీ ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి, పరిష్కారానికి కృషి చేస్తామని వంశీకృష్ణ హామీ ఇచ్చారు.

### తాగునీటి సమస్య పరిష్కారం

కొత్తచెరువు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తాగునీరు సరఫరా చేసే బోర్లు కాలిపోవడంతో 20 రోజులుగా పలు కాలనీల వాసులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడేవారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోకపోవడంతో మంగళవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. దీనికి స్పందించిన అధికారులు బుధవారం ఆ బోరుకు మరమ్మతులు చేపట్టారు. తాగునీటి సరఫరా అయ్యేలా చేశారు. దీంతో తాగునీటి సమస్య కొద్ది వరకు పరిష్కారమైందని, త్వరలోనే తాగునీటి సమస్య పూర్తిగా లేకుండా చేస్తామని ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి గోపాల్‌రెడ్డి తెలిపారు.

### బీజేపీలోకి ఏలుకుంట్ల మాజీ సర్పంచ్

ధర్మవరం రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలుకుంట్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తిరువీధుల లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ బాలప్ప, వారి అనుచరులు బీజేపీలోకి చేరారు. బుధవారం పట్టణంలోని ఎన్‌డీఏ కార్యాలయంలో వీరికి బీజేపీ నియోజవర్గ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు సమక్షంలో వీరు పార్టీలో చేరారు. ఇందులో బీజేపీ మండల కన్వీనర్ గొట్లూరు చంద్ర, బీజేపీ నాయకులు సాకే ఓబిలేసు, డోలా రాజారెడ్డి, అంగజాలరాజు పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన వారితో హరీష్‌బాబు

## క్రైం న్యూస్..

### విద్యుత్ వైర్లు తగిలి.. గ్రాసం దగ్ధం



నల్లమాడ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వైర్లు తగిలి.. ట్రాక్టర్‌లో తీసుకొని వెళ్తున్న మొక్కజొన్న గ్రాసం మొత్తం దగ్ధమైంది. మండలంలోని ఎర్రచెరువుపల్లికి చెందిన నవీన్‌కుమార్‌రెడ్డి ఓడీసీ మండలం దిగువపల్లిలో మొక్కజొన్న గ్రాసాన్ని రూ.10 వేలకు కొనుగోలు చేశాడు. దాన్ని బుధవారం ట్రాక్టర్‌లో స్వగ్రామానికి తీసుకొని వస్తుండగా.. ఎర్రచెరువుపల్లి గ్రామ సమీపంలో విద్యుత్ వైర్లు తగిలి.. గ్రాసానికి మంటలు ఏర్పడ్డాయి. డ్రైవర్ చాకచక్యంగా ఆ ట్రాలీలో నుంచి గ్రాసాన్ని కిందికి వేశాడు. దీంతో గ్రాసం మాత్రమే కాలిపోయింది. దగ్గరలోనే బోరు బావి ఉండడంతో రైతులు, గ్రామస్థులు మూకుమ్మడిగా మోటార్ ద్వారా నీటితో ఆ మంటలు ఆర్పివేశారు. దీంతో ఆ మంటలు సమీపంలోని పొలాలు వ్యాపించకుండా ఆపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ధర్మవరంరూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్శినమల గ్రామ సమీపంలో ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. మండలంలోని మాలగుండ్లపల్లి గ్రామానికి చెందిన నాగరాజు, బలిజమలతండాకు చెందిన గోపాల్‌నాయక్ బైక్‌లో ధర్మవరానికి బయలుదేరారు. దర్శినమల గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగరాజు కాలువిరిగింది. గోపాల్‌నాయక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108లో ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

### రస్తా వివాదం.. వృద్ధురాలిపై దాడి

తాడిమర్రి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కునుకుంట్ల గ్రామంలో బోనాసి రామసుబ్బమ్మ(81)పై అదే గ్రామానికి చెందిన వడ్డి చిన్నలింగారెడ్డి దాడి చేశాడు. రస్తా వివాదంలో భాగంగా చిన్నలింగారెడ్డి రామసుబ్బమ్మను బుధవారం జుట్టుపట్టి లాగి దాడిచేయడంతో ఆమె కింద పడి నడుము బాగా దెబ్బతింది. దీంతో ఆమె లేవలేకపోయింది. దీంతో స్థానికులు ఆమెను ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం బెంగుళూరుకు తీ సుకెళ్లమని వైద్యులు సూచించారు. ఆమె ఫిర్యాదు మేరకు వడ్డి చిన్నలింగారెడ్డిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ క్రిష్ణవేణి తెలిపారు.

### భూమి వివాదం.. 12 మందిపై కేసు

ధర్మవరంరూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మలకుంట వద్ద ఉన్న ఆంజనేయస్వామి దేవుని మాన్యం భూమి వివాదంలో సీసీ కొత్తకోట గ్రామానికి చెందిన 12 మందిపై రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీసీకొత్తకోట ఆంజనేయ స్వామి మాన్యం భూమిని శింగంశెట్టి కుళ్లాయప్ప స్వాధీనం చేసుకుని కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేసి బాడుగులకు ఇచ్చుకుంటున్నారు. దీనిపై రెండురోజుల క్రితం ఆ గ్రామస్థులు అతన్ని నిలదీశారు. స్థలాన్ని ఖాళీ చేయాలని కుళ్లాయప్పతో వాగ్వాదానికి దిగారు. కల్యాణ మండపంలోని సామగ్రిని బయటకు వేశారు. దీంతో శింగంశెట్టి కుళ్లాయప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు సీసీకొత్తకోట గ్రామస్థులు అక్కుల్‌రెడ్డి, ఆదిరెడ్డి, గోవిందరెడ్డి, సురేంద్రరెడ్డి, సాయినాథ్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, నారపరెడ్డి, నాగేష్, నరసింహులు, సుధాకర్‌రెడ్డి, నరసింహరెడ్డి, క్రిష్టారెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### రాచువారిపల్లిలో చోరీపై ..

తనకల్లు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచువారిపల్లిలో దేశాయి భక్తవత్సరెడ్డి నివాసంలో మంగళవారం చోరీ జరిగిన విషయం తెల్సిందే. కుటుంబసభ్యులతో యాత్రకు వెళ్లిన భక్తవత్సలరెడ్డి బుధవారం తిరిగి వచ్చారు. అర కిలో వెండి, ఐదు గ్రాముల బంగారం, మూడు పట్టుచీరలు చోరీ అయినట్లు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపీ తెలిపారు.

### వేధిస్తున్నాడని భర్తపై ..

ధర్మవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినగర్‌కు చెందిన ఓ మహిళను ఆమె భర్త నిత్యం అనుమానిస్తూ వేధించేవాడు. రోజురోజుకు శారీరక, మానసిన వేధింపులు ఎక్కువ కావడంతో.. భరించలేక ఆమె బుధవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు.

### 230 కిలోల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం

ధర్మవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక శివరాంనగర్‌లో సురేశ్ కుమార్ గోదాములో నిల్వ ఉన్న 230 కేజీల ప్లాస్టిక్ కవర్లను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యామ్సన్, కేశవ తెలిపారు. వాటిని డంపింగ్ యార్డ్‌కు తరలించి అక్కడ డిస్పోజ్ చేసినట్లు చెప్పారు.

న్యూస్ బాక్స్

## చెరువులను నీటితో నింపండి



పంప్ హౌస్‌ను పరిశీలిస్తున్న నాయకులు

మడకశిర రూరల్, మార్చి 19: (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ ద్వారా మడకశిర ప్రాంతంలోని చెరువులకు నీరు అందించాలని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు హరి, కమిటీ సభ్యుడు సోమకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని గొల్లపల్లి హంద్రీనీవా పంపుహౌస్‌ను పరిశీలించి ఈ మేరకు ప్రభుత్వాన్ని కోరారు.

## ఉపాధి కూలి చెల్లించండి

లేపాక్షి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలి చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి శివప్ప డిమాండ్ చేశారు. మూడు నెలలుగా కూలి అందకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బుధవారం ఈ మేరకు ఎంపీడీఓ నరసింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ఎండాకాలంలో సౌకర్యాలు కల్పించడంలో అధికారులు అశ్రద్ధవహిస్తున్నారన్నారు. తాగునీరు, మజ్జిగ తదితర వసతులను కల్పించాలన్నారు. సౌకర్యాలు కల్పించడంలో విఫలమైతే ధర్నాచేస్తామని హెచ్చరించారు.

## ప్రత్యేక ఆధార్ కేంద్రాలు : ఎంపీడీఓ

అగళి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ యాదవేంద్ర తెలిపారు. ఈనెల 19 నుంచి 22 వరకు అగళి పంచాయతీ కేంద్రంలో అగళి కోడిపల్లి ఆర్‌జిపల్లి పంచాయతీలకు సంబంధించి కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. 25 నుంచి 28 వరకు మాధవ్, డిపంచాయతీ కేంద్రంలో రావుడి, కోమరేపల్లి, మధుడి పంచాయతీలకు 19 నుంచి 23 వరకు రిగేపల్లి పంచాయతీలో పిబ్యాడిగెర, హెచ్‌డిహళ్లి, రిగేపల్లి గ్రామ పంచాయతీలకు 25నుంచి 26వరకు, ఇనగలూరు పంచాయతీ కేంద్రంలోని హళ్లికెర, ఇనగలూరు, గ్రామ పంచాయతీలకు 27నుంచి 28వరకు నరసాంబుది పంచాయతీ కేంద్రంలో రామనపల్లి నరసాంబుది గ్రామాలలోని విద్యార్థులకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆధార్‌లేని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఉచిత కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సీడీయాప్ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న ఉచిత కోర్సులకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేశవరావు, వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరిక్రిష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొత్తగా సీసీటీవీ ఇన్‌స్టాలేషన్, మొబైల్ రిపేరీ, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ బేసిక్‌నాలెడ్జ్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు ఆధార్‌కార్డు జిరాక్స్‌తోపాటు ఆధార్‌కు లింక్ చేయబడిన ఫోన్‌నంబర్‌తో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాలుగునెలలపాటు శిక్షణ ఉంటుందని అనంతరం వారికి సర్టిఫికెట్లు అందజేసి ఉద్యోగ అవకాశాలు సొంత వ్యాపారాలు చేసుకోవడానికి బ్యాంకు రుణ సౌకర్యం కలిగిస్తామన్నారు. ఆసక్తిగలవారు స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ గణేష్, 9966682246కు సంప్రదించాలన్నారు.

## పది పరీక్షలకు గైర్హాజరు

సోమందేపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బుధవారం జరిగిన హిందీ పరీక్షకు ఇద్దరు గైర్హాజరు అయినట్లు ఎంఈఓ ఆంజనేయులు తెలిపారు.

గోరంట్ల : పట్టణంలోని ఐదు కేంద్రాల్లో నిర్వహిస్తున్న పది పరీక్షలకు బుధవారం 13 మంది గైర్హాజరు అయినట్లు ఎంఈఓ గోపాల్ తెలిపారు.

## ఏబీసీడీ వర్గీకరణపై హర్షం

### రేవంత్‌రెడ్డి, మందకృష్ణకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న దళిత సంఘం నాయకులు

పావగడ, మార్చి19(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు తెలంగాణ రాష్ట్రంలో ఏబీసీడీ వర్గీకరణపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఆమోదించినందుకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, నాయకుడు మందకృష్ణ మాదిగకు పావగడ తాలూకా దళిత సంఘాల ఆధ్వర్యంలో బుధవారం క్షీరాభిషేకం చేశారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఈ కార్యక్రమాన్ని సంఘాలు నిర్వహించాయి. ఇదేరీతిలో కర్ణాటకలో నిర్ణయం తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని దళిత సంఘం నాయకుడు టీఎన్‌పేట రమేష్ హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కోరుట నరసప్ప, ఏపీపీ రామాంజినప్ప, రామక్రిష్ణ, ఈరన్న, సుబ్బరాయప్ప, వి.నాగేష్ నరసింహులు, హనుమంతరాయ పాల్గొన్నారు.

## మసీదు వద్ద మద్యంషాపు వద్దు

### ఎక్సైజ్ సీఐకి మతపెద్దల వినతి

హిందూపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మసీదు వద్ద మద్యం షాపు ఏర్పాటు చేయాలని చూస్తున్నారని, వెంటనే ఆ ప్రయత్నాలను విరమించుకోవాలని ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్యకు మతపెద్దలు బుధవారం వినతిపత్రం సమర్పించారు. పరిగి రోడ్డులో ఉన్న మద్యంషాపును మసీదు వద్దకు మార్చాలని చూస్తున్నారని, వెంటనే అధికారులు స్పందించి ఆ ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు. ఇర్షాద్, అమీన్, బాబాఖాన్, ఫాజిల్, నూరుల్లా, అంజాద్, తదితరులు ఎక్సైజ్ సీఐను కలిసిన వారిలో ఉన్నారు.

## దరఖాస్తు చేసుకోండి

మడకశిరటౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో నిర్వహించే ఉచిత సామూహిక వివాహాలకు వచ్చేనెల 4వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి బుధవారం తెలిపారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాలకు చెందినవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా వివాహాలు నిర్వహిస్తామన్నారు.

# అబలకు అభయం శక్తి

### భద్రత మహిళల చేతుల్లోనే

### రక్షణ కవచంగా శక్తియాప్

### అవగాహన కల్పిస్తున్న పోలీసులు




హిందూపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటినుంచి అమ్మాయిలు, మహిళలు బయటకు వెళ్తే తిరిగి క్షేమంగా ఇంటికి వస్తారో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట మహిళలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం, పోలీస్ శాఖ మహిళల రక్షణకు ప్రత్యేక కార్యాచరణ చేసింది. మహిళా రక్షణకు తాజాగా శక్తియాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆపదలో ఉన్న వనితలు ఒక్క మీట నొక్కితేచాటు తక్షణమే పోలీసులు అక్కడకు చేరుకుని రక్షణగా నిలుస్తారు. జిల్లాలో జోన్లవారీగా శక్తి బృందాలు ఏర్పాట్లు రంగం సిద్ధం చేశారు. ఒక్కో బృందానికి ఎస్‌ఐ ఇన్‌చార్జి వ్యవహరిస్తారు. ఇందులో సభ్యులుంటారు. అయితే దీనికి సంబంధించిన పూర్తి ప్రణాళిక జిల్లా యంత్రాంగం త్వరలోనే ప్రకటించనుంది.

### నమోదు చేసుకోవాలి ఇలా ..

సెల్‌ఫోన్‌లో ప్లేస్టోర్ నుంచి యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలి. అందులో పేరు, చిరునామాతోపాటు సెల్‌ఫోన్‌నంబరు, లొకేషన్ తదితర వివరాలు పొందుపరచాలి. దీంతోపాటు కుటుంబ సభ్యులు, బంధువులు నిత్యం అందుబాటులో ఉండే ఇద్దరి ఫోన్‌నంబర్లు యాప్‌లో నమోదు చేయాలి.

### క్షణాల్లో సమాచారం చేరవేత

అత్యవసర పరిస్థితుల్లో ఉన్న మహిళ ఈ యాప్ ఓపెన్‌చేసి అందుబాటులోని ఎస్‌ఓఎస్ ఆప్షన్‌ను క్లిక్‌చేస్తే పది సెకెన్ల నిడివిగల వీడియో, ఆడియో ఆటోమెటిక్‌గా రికార్డ్ అయి లొకేషన్‌తో సహా పోలీస్ కంట్రోల్‌రూమ్‌కు సమాచారం చేరుతుంది. ఎస్‌ఓఎస్ బటన్ నొక్కి మూడుసార్లు ఫోన్‌ని కదిలించినా మీ సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందుతుంది. పిల్లలు తప్పిపోయినా కూడా చైల్డ్‌రిపోర్టింగ్ ఆప్షన్ ద్వారా ఫిర్యాదు చేసే సౌకర్యం ఈ యాప్‌లో పొందుపరిచారు. చిన్నారుల ఆచూకీ కనుగొనేందుకు వారిపేరు, వయసు, చివరగా చూసిన లొకేషన్, ఫొటో తదితర వివరాలు అప్‌లోడ్‌చేస్తే పోలీసులు వెంటనే స్పందిస్తారు. ఈ యాప్‌లో అత్యవసర నంబర్లు, భద్రంగా ప్రయాణం, నైట్‌షెల్టర్ వివరాలతో కూడిన ఆప్షన్‌లు ఉంటాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్‌స్టేషన్‌లో అక్కడ ఎస్‌హెచ్‌ఓల ఫోన్‌నంబర్లు ఇందులో పొందుపరిచి ఉంటారు. గృహహింస, కుటుంబ తగాదాలు, మద్యం మత్తులో భర్త వేధింపులు తదితర నేరాలపై కుటుంబ కౌన్సిలింగ్ తీసుకునేందుకు ఈయాప్ ద్వారా కోరవచ్చు. బహిరంగంగా మద్యం, గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం, అసాంఘిక కార్యకలాపాలతో ఎదురయ్యే ఇబ్బందులపై సైతం ఫిర్యాదు చేయవచ్చు.

### విస్తృత అవగాహన

శక్తియాప్‌ను ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8న ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులతోపాటు కానిస్టేబుళ్ల వరకు శక్తియాప్‌పై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ముఖ్యంగా పాఠశాల, కళాశాల విద్యార్థినులు, గార్మెంట్స్ పరిశ్రమలో పనిచేసే మహిళా కార్మికులు, డ్వాక్రా సంఘాల మహిళలకు దీనిపై పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏదైనా ఆపద తలెత్తినప్పుడు ఎమర్జెన్సీ కాలింగ్ 100, 112తో తక్షణకాల్ సదుపాయం ఉంటుంది. లైవ్‌ట్రాకింగ్ పద్ధతి ద్వారా లొకేషన్ తెలిగ్గా పోలీసులకు చేరుతుంది.

### మహిళలకు రక్షణ కవచం: మహేష్, డీఎస్పీ



మహిళల రక్షణ కోసం ప్రభుత్వం, పోలీస్‌శాఖ రూపొందించిన శక్తియాప్ మహిళలకు రక్షణ కవచంగా ఉంటుంది. యువత, మహిళ, ఫోన్‌యాప్ ఉపయోగించడంవల్ల భద్రతకు డోకా ఉండదు. పోలీస్‌శాఖ పూర్తిస్థాయిలో శక్తియాప్‌పై పనిచేస్తుంది. ఇందుకోసం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. మహి ళల భద్రత వారిచేతుల్లోనే ఉంటుంది.

## న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయింపు

గోరంట్ల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలి గ్రామంలో ఎస్సీకాలనీ వాసులు న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయించి బుధవారం రాస్తారోకో చేశారు. ఎన్‌హెచ్ 342 రహదారి విస్తరణ పనులకోసం బూదిలిలో 33 ఇళ్లకు పరిహారం చెల్లించి, ఇటీవల ఇళ్ల తొలగింపునకు ఆర్డీవో సువర్ణ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. తమకు ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్లను నిర్మిస్తామని చెప్పారని మహిళలు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. రోడ్డు విస్తరణలో వివక్షత చూపుతున్నారని, ప్రైవేటు పరిశ్రమకు నష్టం కలగకుండా రోడ్డు మళ్లించారని ఆరోపించారు. పేదలున్నవైపు 12 అడుగుల రోడ్డు నిర్మాణం చేపట్టడం శోచనీయమన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని బైఠాయించారు. దీంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. వెంటనే సీఐ శేఖర్ సిబ్బందితో అక్కడకు చేరుకుని శుక్రవారం తహసీల్దార్, ఆర్డీఓలు గ్రామానికి వచ్చి చర్చించి నిర్ణయం తీసుకుంటారని చెప్పడంతో ఆందోళన విరమించారు.



బూదిలిలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న మహిళలు

## సమస్యల పరిష్కారం వేగవంతం

### ప్రత్యేక గ్రీవెన్స్‌లో టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

హిందూపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక గ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ చైర్మన్ రమేష్, నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం హిందూపురం మునిసిపాలిటీకి సంబంధించి ఎమ్మెల్యే కార్యాలయం వద్ద గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఇక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్, టీడీపీ మండల కన్వీనర్ అశ్వర్థనారాయణరెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు. లేపాక్షిలో మండల కన్వీనర్ జయప్ప, నాయకులు, చిలమత్తూరు మండలంలో తహసీల్దార్ వెంకటేశ్, నాయకులు, పాల్గొని గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాలకు హాజరైన కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి బుధవారం ప్రత్యేక గ్రీవెన్స్‌డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని, ప్రతి వారం ఒక్కోశాఖకు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదులు తీసుకుంటామన్నారు. ఈ వారంలో వచ్చిన సమస్యలను వచ్చేవారంలోపు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఎందుకు పరిష్కారం కాలేదో చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందన్నారు. ముఖ్యంగా చిలమత్తూరు మండలంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇష్టానుసారంగా రెవెన్యూ అధికారులు వ్యవహరించడంవల్ల కుప్పలు తెప్పలుగా భూసమస్యలపై ఫిర్యాదు రావడం జరుగుతోందన్నారు. నెలలో ఒకసారి కలెక్టర్, ఆర్డీఓను చిలమత్తూరుకు పిలిపించి రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు.



గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న రమేష్, శ్రీనివాసరావు



## అడవికి నిప్పు - పట్టించుకోని అటవీ అధికారులు

గుడిబండ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కోనసీమను తలపిస్తూ పచ్చదనంతో విరాజిల్లుతున్న అడవికి నిప్పు పెట్టడంతో పచ్చనిచెట్లు కాలిపోయాయి. బుధవారం మధ్యాహ్నం అలాంటి అటవీ ప్రాంతానికి నిప్పంటించడంతో పచ్చనిచెట్లు కాలిపోయాయి. ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారులు పట్టణ ప్రాంతానికే పరిమితమవుతున్నారు. చెట్లకు నిప్పు పెడితే జరిగే అనర్థాలపై ప్రజల్లో చైతన్య పరచాలన్న అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. చెట్లు పెంచేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లక్షలాది రూపాయలు వెచ్చించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టినా ప్రయోజనం లేకుండా పోతోందని ప్రజలు వాపోతున్నారు.

### జన సంద్రంలా

## భూతప్పల ఉత్సవం



భూతప్పలు వెళ్లేదారిలో పడుకున్న భక్తులు

రొళ్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలిసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం భూతప్పల ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆంధ్ర సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో మంగళవారం సాయంత్రమే ఆలయం వద్దకు చేరుకోవడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. దీర్ఘకాలిక రోగాలు నయం కావాలని, సంతాన భాగ్యం కలగాలని, ఇతర బాధలతో ఉన్న వారు ఉదయం మారుతీ కాలనీ సమీపంలోని ముత్తరాయస్వామి ఆలయంలో భూతప్పలు ప్రత్యేక పూజలు చేసుకొని మేళ తాళాలతో పాదాల బండ వద్ద నుంచి నృత్యం చేసుకొంటూ బయలుదేరారు. అంతకుముందే భక్తులు మడిస్నానాలు ఆచరించి తడి దుస్తులతోనే భూతప్పల కాలి స్పర్శ కోసం వారు వచ్చే మార్గంలో కిలోమీటర్ల మేర బోర్లా పడుకొన్నారు. వారి మీదుగా భూతప్పలు కాలుమోపుతూ ముందుకు కదిలారు. ఇలా చేయడం వల్ల దీర్ఘకాలిక తమ సమస్యలు మరియు సంతాన భాగ్యం కల్గుతుందని భక్తుల నమ్మకం. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకొన్న భూతప్పలు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అక్కడి నుంచి ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో వెలిసిన భూతప్పల ఆలయం వద్దకు చేరుకొని ఆలయంలో భూతప్పలను కూర్చొబెట్టారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం కల్పించారు. ట్రైనీ డీఎస్పీ ఉదయ పవని, సీఐ రాజకుమార్, ఎస్‌ఐ వీరాంజనేయులు సిబ్బందితో గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు.



స్వామివారికి ప్రత్యేక అలంకరణ

## పోక్సో కేసు బాధితురాలు మృతి

అగళి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన పోక్సో కేసు బాధితురాలు బెంగళూరులో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. గత నెలలో అగళి మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికను మడకశిర మండలం చౌటుపల్లికి చెందిన మధు తీసుకువెళ్లాడు. ఈ మేరకు అగళి పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. బాలిక తన ఇంటికి వెళ్లి, గత నెల 25న పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. బాలిక మృతిచెందడంతో ఎస్‌ఐ వీరేష్ బెంగళూరు విక్టోరియా ఆసుపత్రికి వెళ్లి వివరాలు సేకరించారు.

## ఐలా పరిధిలోకి ఆటో నగర్

### హామీ నెరవేర్చిన ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని ఆటోనగర్ అభివృద్ధి దిశగా అడుగులు పడ్డాయి. 55.92 ఎకరాల్లో ఉన్న ఆటోనగర్‌ను పారిశ్రామిక ఏరియా లోకల్ అథారిటీకి (ఐలా) అప్పగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణ సమీపంలో ఏపీఐఐసీ భూమిని ఆటోనగర్ ఏర్పాటుకు గతంలో కేటాయించారు. పట్టణం విస్తరణతో ఆటోమొబైల్ షాపులు, భవనాలు వందలాదిగా పెరిగాయి. కానీ భవన నిర్మాణానికి అనుమతులు, క్రయ విక్రయాలకు ఆస్కారం లేకపోయింది. అన్నీ అగ్రిమెంటు స్థాయిలో ఉండిపోయాయి. మౌలిక సదుపాయాల కల్పన విషయంలో మున్సిపాలిటీ, ఏపీఐఐసీకి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించాలని మున్సిపల్, ఏపీఐఐసీ అధికారులకు ఆటో నగర్ వాసులు విన్నంచారు. తమ పరిధిలోని ఆటోనగర్‌ను అప్పగించాలని ఏపీఐఐసీ పలుమార్లు కోరింది. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు ఆటోనగర్ వాసులు తమ సమస్యలను విన్నవించారు. పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు. హామీ మేరకు సీఎం దృష్టికి తీసుకెళ్లి, ఆటోనగర్‌ను ఐపీఐఐసీకి అప్పగించేలా ఉత్తర్వులు జారీ చేయించారు. ఇక మీదట ఆటోగన్‌లో భవన నిర్మాణ అనుమతులు, పన్ను వసూళ్లు, మ్యుటేషన్, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పన ఐలా చూసుకుంటుంది. ఇక్కడి నుంచే వచ్చే పన్నుల్లో 50 శాతాన్ని మున్సిపాలిటీకి ఇస్తుంది.

## రైతులకు రాయితీతో పరికరాలు

చిలమత్తూరు, మార్చి 19( ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు రాయితీతో వ్యవసాయ పరికరాలను అందజేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ బుధవారం తెలిపారు. మండలానికి 8 బ్యాటరీ స్ప్రేయర్లు, 14 పెట్రోల్ స్ప్రేయర్లు, 24 ట్రాక్టర్‌కి సంబంధించిన మడకలు, రొటోవేటర్ మంజూరయ్యాయన్నారు. ఈ పరికరాలపై 50 శాతం రాయితీ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఆశక్తి కలిగిన రైతులు ఆయా సంబంధిత రైతు సేవా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5 ఎకరాల లోపు భూమిని కలిగి, తప్పక పంట నమోదు చేసుకున్న వారు అర్హులన్నారు. మరిన్న వివరాలకు రైతు సేవా కేంద్రానికి వచ్చి తెలుసుకోవాలని, అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## చట్టాలపై అవగాహన

సోమందేపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేకలపల్లి గ్రామంలో టింబక్టివ్ కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దుర్గాశక్తి సొసైటీ సభ్యులు ఏర్పాటుచేసిన ఉచిత న్యాయసేవా సదస్సులో బుధవారం మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బాల్య వివాహాలపై నాటిక ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అసోసియేట్ రవళి, పావని, మహాశక్తి సీఈఓ రమేజ, లక్ష్మీదేవి, ముంతాజ్‌బేగం, లక్ష్మమ్మ, కృష్ణమ్మ, దుర్గాశక్తి సొసైటీ లక్ష్మమ్మ, ఆదిలక్ష్మమ్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు

సోమందేపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి చెరువులో మట్టి తరలింపు సంఘటనకు సంబంధించి బుధవారం ఏర్పడిన వివాదంలో సీపీఐ మండల కార్యదర్శి బాలస్వామి, టీడీపీ నాయకులు పరస్పరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. కొంతమంది చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారని గ్రామస్థుల సమాచారం మేరకు సీపీఐ మండల కార్యదర్శి బాలస్వామి అక్కడకు చేరుకుని టీడీపీ నాయకులు రైతుల పొలాలకు చెరువు మట్టి తరలిస్తున్నారని వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో వారి మధ్య ఘర్షణ జరగ్గా ఒకరిపై ఒకరు పోలీసస్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

## చెరువులో పడి యువకుడి మృతి

గోరంట్ల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితంలేని యువకుడు ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతిచెందినట్లు సీఐ శేఖర్ తెలిపారు. మండలంలోని బోయలపల్లికి చెందిన రుద్రయ్యగారి సుదర్శన్ (24) కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా ఉన్నాడు. ఈనెల 17న పొలానికి వెళ్లిన సుదర్శన్ ఇంటికి తిరిగి రాలేదు. అయితే బుధవారం చెరువులో శవమై కనిపించాడు. ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. తండ్రి ఈశ్వరప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో లైన్‌మన్‌కు గాయాలు

సోమందేపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): విద్యుతాఘాతానికి గురై లైన్‌మన్ రామచంద్రారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. ఆర్బీకే వద్ద మంగళవారం రాత్రి లైన్ ట్రిప్ కావడంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. స్థానికుల ఫిర్యాదు మేరకు బుధవారం ఉదయం లైన్ ఇన్‌స్పెక్టర్ రామక్రిష్ణ, లైన్‌మన్ రామచంద్రరెడ్డి మరమ్మతు చేస్తుండగా రామచంద్రారెడ్డి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. ప్రథమ చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. అయితే ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని ఏడీఏ శేషగిరి తెలిపారు.

## నవమి వేడుకలకు ఆహ్వానం



సంజయ్‌రాథోడ్‌ను ఆహ్వానిస్తున్న శంకర్‌లాల్‌నాయక్

గోరంట్ల, మార్చి19 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకలకు మహారాష్ట్ర మంత్రి సంజయ్ రాథోడ్‌ను ఆహ్వానించినట్లు కరావులపల్లి తండా అభయాంజనేయ స్వామి ఆలయ ధర్మకర్త శంకర్‌లాల్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నుంచి ప్రముఖులు హాజరవుతున్నారని, భక్తులు వేడుకలకు తరలిరావాలని కోరారు.

## ఆలయానికి రూ.25 వేలు

గుడిబండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలిసిన తుమ్మల మారమ్మ ఆలయానికి గుడిబండ చందన గ్రామైక్య సంఘం మహిళా సంఘ సభ్యులు రూ.25వేల ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ నాగరాజు, సర్పంచు కరుణాకర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.